## రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లకు శిక్షణ


మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, మార్చి 10: రెవెన్యూ సిబ్బంది నిజాయితీగా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్లకు సర్వీస్ అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నగరంలోని టీటీడీసీలో సోమవారం ప్రారంభమైంది. కలెక్టర్ మాట్లాడుతూ.. విధులను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. భూ చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. విశ్రాంత ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సురేష్ పొద్దర్ శిక్షణ ఇచ్చారు. కలెక్టరేట్ పర్యవేక్షకుడు కరుణాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## కవిరాజ్‌నగర్‌లో నూతన రేషన్ షాపు ప్రారంభం


రేషన్ షాపును ప్రారంభించి బియ్యం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రమా, అధికారులు

రఘునాథపాలెం, మార్చి 10: ఖమ్మం కవిరాజ్‌నగర్‌లో ప్రజా పంపిణీకి చెందిన నూతన చౌక దుకాణం సోమవారం ప్రారంభమైంది. దీనికి కేఎంసీ 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపూడి రమా, ఖమ్మం అర్బన్ సివిల్ సప్లయీస్ డీటీ ఎం.వెంకటేశ్వర్లు, ఖమ్మం రూరల్ డీటీ విజయ్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. రేషన్ పంపిణీ సమయంలో నిత్యం లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని, సక్రమంగా బియ్యం అందజేయాలని రేషన్ డీలర్ తోట వెంకన్నకు కార్పొరేటర్ సరిపూడి రమ సూచించారు. ఈ సందర్భంగా ఈ-పాస్ మిషన్‌ను స్వయంగా ఆపరేట్ చేసి ఓ లబ్ధిదారురాలికి బియ్యం అందజేశారు. రేషన్ డీలర్స్ అసోసియేషన్ నేతలు షేక్ జానీమియా, వుట్కూల బాబు, వాకదాని శ్రీనివాసరావు, గోళ్ల మురళి, జావీద్, స్థానిక పెద్దలు గుండెబోయిన నర్సింహా రావు, నూతలపాటి నాగేశ్వరరావు, నెల్లూరి పార్థసారధి, చిలుమూరు కోటి పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని అధికారులు

### గ్రీవెన్స్‌కు వచ్చి ఇబ్బందిపడిన దరఖాస్తుదారులు


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న మహిళ

కారేపల్లి, మార్చి 10 : అధికారులు వేళాపాళా లేకుండా రావడంతో గ్రీవన్స్‌లో వినతులు సమర్పించడానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ ఘటన కారేపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ డేలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. తర్వాత వాటికి పరిష్కార మార్గం చూపుతారు. అయితే సోమవారం నిర్వహించి గ్రీవెన్స్‌కు తహసీల్దార్ సంపత్‌కుమార్ సెలవులో ఉండడంతో డిప్యూటీ తహసీల్దార్ పి.కృష్ణయ్య అదనపు బాధ్యతలు స్వీకరించి నిర్వహణాధికారిగా వ్యవహరించారు. అయితే మిగిలిన శాఖల అధికారులు ఎంతకూ రాకపోవడంతో దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన ప్రజలు విసుగుచెంది వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాక కొన్ని శాఖల అధికారులు హాజరుకాకుండా కిందిస్థాయి సిబ్బందిని పంపించడంతో తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని గ్రీవన్స్‌కు వచ్చిన పలువురు ఆరోపిస్తున్నారు.

## పూణె స్టడీ టూర్‌తో అవగాహన

### మేయర్ పునుకొల్లు నీరజ


మాట్లాడుతున్న మేయర్ నీరజ


ఖమ్మం, మార్చి 10: ఖమ్మం కార్పొరేటర్లు, అధికారుల బృందం ఇటీవల జరిపిన పూణె స్టడీ టూర్ ఎంతగానో ఉపయోగపడిందని, అనేక విషయాలపై అవగాహనకు ఉపయోగపడిందని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ఆమె సోమవారం తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. తమ బృందం తెలుసుకున్న విషయాలను వివరించారు. కార్పొరేటర్లు కొత్తపల్లి నీరజ, కర్నాటి కృష్ణ, బిజె.క్లైమేట్, మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరు వెంకటేశ్వర్లు, శరత్ కుమార్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్ పాల్గొన్నారు.

## మండలంలో పర్యటించిన సీపీఎం నాయకులు


సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

వైరా టౌన్/కొణిజర్ల, మార్చి 10: వైరా మున్సిపాలిటీ పరిధిలో 16వ వార్డు, కొణిజర్ల మండలంలోని పల్లిపాడు గ్రామాల్లో సోమవారం సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు స్థానిక నాయకులతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి పనులు లేకుండా కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉపాధి పనులు మున్సిపాలిటీ పరిధిలో కల్పించాలన్నారు. ఉపాధి పనులతో సంబంధం లేకుండా పేదలకు రూ.12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం పేదలకు అందించాలని వర్షాకాలంలో వరదలతో ఇళ్లలో నీళ్లు వస్తున్నాయని, రోడ్డుపక్కన ఉన్న వరద కాలువపై సైడ్ వాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12న వైరా మున్సిపాలిటీ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బత్తి వీరన్న, పారుపల్లి శ్రీనాథ్‌బాబు, దామా వెంకటేశ్వరరావు, పెనుగొండ ఏడుకొండలు, సుల్తానా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై ఇంటింటి సర్వే


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం కమాన్‌బజార్, మార్చి 10: ప్రజాసమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహిస్తామన్నారు. గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 20నుంచి 30వ తేదీ వరకు మండల, మున్సిపల్ కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.




# తొలుత తెలంగాణ రైతులకే సాగునీరు

- ఆ తరువాతే ఆంధ్రాకు విడుదల చేస్తాం
- బీబీసీ కెనాల్ పరిశీలనలో ఇరిగేషన్ ఎస్ఈ
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన


బీబీసీ కెనాల్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి

బోనకల్లు, మార్చి 10: తెలంగాణ రైతులకు సాగునీరు అందించిన తర్వాతే ఆంధ్రా ప్రాంతానికి సరఫరా చేస్తామని నీటి పారుదల శాఖ కల్లూరు ఎస్ఈ గాలి వాసంతి తెలిపారు. బోనకల్లు బ్రాంచ్ కెనాల్ (బీబీసీ) పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందక మొక్కజొన్న సహా పలు పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో 'పైరు ఎండుతోంది' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. బీబీసీ కెనాల్‌కు సరఫరా అవుతున్న నీటిని పరిశీలించాలని ఎస్ఈ వాసంతిని ఆదేశించారు. ఈ మేరకు మధిర ఈఈ రామకృష్ణ, బోనకల్లు, మధిర డీఈలు తమ్మారపు వెంకటేశ్వర్లు, నాగబ్రహ్మయ్యలతో కలిసి సోమవారం ఆమె బీబీసీ కెనాల్ పరిధిలోని కలకోట మేజర్, ఆళ్లపాడు, నారాయణపురం మేజర్, వల్లాపురం, రాపల్లె కాలువలను పరిశీలించారు. బీబీసీ పరిధిలోని కాలువలన్నింటికీ పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బోనకల్లు సబ్ డివిజన్ కార్యాలయంలో 'నమస్తే తెలంగాణ'తో ఆమె మాట్లాడుతూ.. కొణిజర్ల జీరో రెగ్యులేటర్ నుంచి 21వ రెగ్యులేటర్ వరకు ఉన్న కాలువల రెగ్యులేటర్లను మూసివేశామని, ఆ నీటిని బోనకల్లు పరిధిలో గల కాలువలన్నింటికీ సరఫరా చేస్తున్నామని తెలిపారు. 1,350 క్యూసెక్కుల నీరు సరఫరా కావాల్సి ఉన్నప్పటికీ 1,000 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. కాలువ మరమ్మతుల కారణంగా మిగిలిన 350 క్యూసెక్కుల నీరు సరఫరా చేయలేకపోతున్నామన్నారు. బీబీసీ కెనాల్ పరిధిలో 80 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయని, చివరి భూములకూ సాగునీరు అందించి పంటలను కాపాడుతామని అన్నారు. కాలువలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. కాంట్రాక్టర్లు రాకపోవడం వల్ల మరమ్మతులు చేసేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. వేసవిలో మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరు అందిస్తామని తెలిపారు.

## ఎంపీ వద్దిరాజు సంతాపం

ఖమ్మం, మార్చి 10: తెలంగాణ ఉద్యమకారుడు, టీఎన్‌జీవోస్ అసోసియేషన్ కోశాధికారి, ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్ రామినేని శ్రీనివాస్ అకాల మృతిపట్ల రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. శ్రీనివాస్ కుటుంబీకులకు, బంధుమిత్రులకు సానుభూతి తెలిపారు.

## జానపద గాయకుడికి అవార్డు


అవార్డు అందుకుంటున్న పాగి వెంకన్న

ఖమ్మం, మార్చి 10: జిల్లాకు చెందిన జానపద గాయకుడు పాగి వెంకన్నకు భారత విభూషణ్ అవార్డు దక్కింది. నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతి వేదికగా జరిగిన కార్యక్రమంలో అవార్డును పాగి వెంకన్న అందుకున్నారు.

## టీజీఎస్ ఆర్టీసీ 'లాజిస్టిక్స్'కు ఆహ్వానం

ఖమ్మం, మార్చి 10: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతకు టీజీఎస్ ఆర్టీసీ మంచి ఉపాధి అవకాశాన్ని కల్పిస్తున్నది. ఏన్కూరు, జూలూరుపాడు, సుజాతనగర్, దమ్మపేట, టేకులపల్లి, కూసుమంచి, కారేపల్లి మండల కేంద్రాల్లో లాజిస్టిక్స్ కేంద్రాలను నిర్వహించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఈ మేరకు ఆర్టీసీ ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం రీజియన్ ఏటీఎం వి.రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం నిర్వహించేందుకు కంప్యూటర్, ప్రింటర్, వేయింగ్ మిషన్ ఉండాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 91542 98582 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

## శివాలయం భూములు కాపాడండి

తిరుమలాయపాలెం, మార్చి 10: మండలంలోని కొక్కిరేణిలో కాకతీయుల నాటి పురాతన శివాలయం చుట్టు ఉన్న ఆలయ భూములను పరిరక్షించాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు ప్రజావాణిలో తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఆలయం చుట్టు ఉన్న భూములను సర్వేచేసి హద్దులను నిర్ణయించాలని కోరారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల వివరాలను మీడియా ద్వారా ప్రకటించి పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో గంట కృష్ణ, గుగ్గిళ్ల అశోక్, బీఎస్పీ నాయకులు కొమ్ము పూలే , మట్టె నాగేశ్వరావు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ అవగాహన సదస్సు


మాట్లాడుతున్న రవీందర్ రావు

ఖమ్మం, మార్చి 10: ఎల్ఆర్ఎస్‌పై సోమవారం జిల్లాపరిషత్ సమావేశంలో అవగాహన సదస్సును జిల్లా రిజిస్ట్రార్ ఎం.రవీందర్ రావు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ కోసం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ టి.సంపత్ కుమార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఎస్.రమాకిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజావాణి' దరఖాస్తులకు తక్షణ పరిష్కారం

### మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం, మార్చి 10: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులకు అదే రోజు పరిష్కారం చూపాలని మున్సిపల్ అధికారులను కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయన సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అధికారులతో మాట్లాడుతూ.. దరఖాస్తులను వెన్వెంటనే (అదే రోజు) పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. ఒక సారి వచ్చిన దరఖాస్తుదారు.. మళ్లీ రాకుండా అదే రోజు పరిష్కారయ్యేలా చూడాలన్నారు.

**ఎల్ఆర్ఎస్‌కు మరో రెండు కౌంటర్లు**

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో వస్తున్నందున, మరో రెండు కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. దరఖాస్తుదారుల సమస్యను తెలుసుకుని, ఎల్ఆర్ఎస్ ఎలా కట్టాలో వివరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులతో చెప్పారు. కమిషనర్ ఆదేశంతో అధికారులు సోమవారం అప్పటికప్పుడు కౌంటర్లు ఏర్పాటు చేశారు.

## రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్, మార్చి 10: సత్తుపల్లి నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందని ఎమ్మెల్యే మట్టా రాగమయి తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలను 25 ఎకరాల్లో నిర్మాణం జరుగుతుందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే సత్తుపల్లి నియోజకవరగలో రూ.700 కోట్లతో అభివృద్ధి చేపట్టినట్లు పేర్కొన్నారు. వేంసూరు మండలం కల్లూరుగూడెంలో రూ.240 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ, రూ.2 కోట్ల సింగరేణి నిధులతో సత్తుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణానికి మంజూరయ్యాయని, టెండర్లు ప్రక్రియ పూర్తయిందన్నారు. రూ.2 కోట్లతో వేంసూరు రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, రూ.80 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్లు దోమ ఆనందబాబు, భాగం నీరజచౌదరి, చల్లగుళ్ల నర్సింహారావు, మందపాటి ముత్తారెడ్డి, తోట సుజలారాణి, గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా, పసుమర్తి చంద్రారావు, దూదిపాళ్ల రాంబాబు, ఎండీ.గఫార్‌ఖాన్ పాల్గొన్నారు.

**ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల మంజూరు**

వైరాటౌన్, మార్చి10: వైరాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల నిర్మాణానికి రూ.200కోట్లు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఈ పాఠశాలలను నిర్మిస్తున్నామన్నారు. మండలంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఉన్న పుణ్యపురం గ్రామంలో 109 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరయ్యాయని, వాటి నిర్మాణానికి గాను రూ.5.45కోట్లు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. సమావేశంలో బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, దాసరి దానేలు, డీబీకే.రత్నం, కోసూరి శ్రీనివాసరావు, బోళ్ల గంగారావు, పల్లపు కొండలు పాల్గొన్నారు.

## భగవద్గీత వ్యక్తిత్వానికి తీర్చిదిద్దే పవిత్రగ్రంథం


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం, విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

సత్తుపల్లిటౌన్, మార్చి 10: భగవద్గీత వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే పవిత్రగ్రంథమని, విలువలతో కూడిన జీవనమార్గం కనుక విద్యార్థి దశ నుంచే దీనిని చదవడం అలవర్చుకోవాలని సత్తుపల్లి ఏసీపీ రఘు అన్నారు. ఇస్కాన్ ముంబై వారి ఆధ్వర్యంలో ఇటీవల సత్తుపల్లిలో విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు అందజేసి 'వాల్యూ ఆఫ్ ఎడ్యుకేషన్' అంశంపై పోటీలు నర్వహించారు. విజేతలకు సోమవారం జోహార్ నగర్ శ్రీకృష్ణమందిరంలో ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, ఇస్కాన్ ప్రతినిధి నర్సింహపూదాస్ బహుమతులు అందజేశారు. సత్తుపల్లి డివిజన్ ప్రైవేటు పాఠశాలల సంఘ అధ్యక్షుడు పసుపులేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కంచేటి రమేశ్, సృజన సాహితి సంస్థ నిర్వాహకులు రామకృష్ణ, మధుసూదన్‌రాజు, ఆయా పాఠశాలల ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**భగవద్గీత పోటీల్లో టాలెంట్ టెస్ట్ విద్యార్థుల ప్రతిభ**

ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత జిల్లా స్థాయి పోటీల్లో స్థానిక టాలెంట్ స్కూల్ విద్యార్థి సీహెచ్.గీతిక తృతీయస్థానం సాధించి రూ.12 వేల స్మార్ట్ వాచ్‌ను బహుమతిగా అందుకున్నారు. అదేవిధంగా స్కూల్ టాపర్స్‌గా ఎండీ.రహీల్, బీ.రాంచణ్ నిలిచారు. విజేతలకు సత్తుపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏ.రఘు, ఎంఈవో ఎన్.రాజేశ్వరరావు, లైబ్రేరియన్ రామకృష్ణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మధుసూదన్‌రాజు ఇస్కాన్ నిర్వాహకుల నుంచి బహుమతి అందుకున్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, స్కూల్ ఇన్‌చార్జి శంకర్ అభినందించారు.

## కానిస్టేబుల్‌పై కత్తితో దాడిచేసిన దొంగ



సత్తుపల్లి టౌన్, మార్చి 10: సత్తుపల్లి పట్టణంలో సోమవారం రాత్రి ఓ అంతర్ రాష్ట్ర దొంగ.. ఓ కానిస్టేబుల్‌ను కత్తితో గాయపరిచి పరారయ్యాడు. సత్తుపల్లి పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఐడీ పార్టీ కానిస్టేబుల్ నరేశ్ సోమవారం రాత్రి స్థానిక బస్టాండ్ వద్ద విధుల్లో ఉన్నాడు. అదే బస్టాండ్‌లో.. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కన్పించాడు. అతడు కూడా కానిస్టేబుల్‌ను గమనించి బైక్‌పై పారిపోతున్నాడు. దీంతో కానిస్టేబుల్ నరేశ్ కూడా బైక్‌పై అతడిని వెంబడించాడు. అలా వెంబడిస్తూ వేం సూరు రోడ్డులోని సత్తుపల్లి శివారు ప్రాంతానికి చేరుకున్నాక ఒక్కసారిగా వెనుదిరిగిన ఆ వ్యక్తి.. కానిస్టేబుల్‌ను అడ్డగించాడు. నరేశ్ తల భాగంలో రెండు చోట్ల, భుజం భాగంలో రెండు చోట్ల కత్తితో పొడిచాడు. గాయపడిన కానిస్టేబుల్‌ను పోలీసులు వెంటనే సత్తుపల్లి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం నరేశ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. అయితే, కత్తితో పొడిచిన వ్యక్తి ని .. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా చాట్రాయి గ్రామానికి చెందిన అంతర్ రాష్ట్ర దొంగ సురేందర్‌గా పోలీసులు గుర్తించారు.


## పెద్దాసుపత్రిలో గ్లకోమా వైద్య శిబిరం

ఖమ్మం సిటీ, మార్చి 10: ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు ఈ శిబిరం కొనసాగుతుందని చెప్పారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ బి.రామునాయక్, డాక్టర్ ఆయేషా బేగం, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అస్మా, డాక్టర్ శ్రావణి, అసిస్టెంట్స్ వీనా, నరేశ్ పాల్గొన్నారు.

## కంటి వైద్యశిబిరం

సత్తుపల్లిటౌన్, మార్చి10: పట్టణంలోని పీవీ.నర్సింహారావుకాలనీలో కొత్తగూడెం ఏరియా మేనేజర్ ఎం.షాలేంరాజు ఆదేశాల మేరకు జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఖమ్మం నగరంలోని శరత్ మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి వైద్యులు 154 మంది ఉద్యోగులు వారి కుటుంబసభ్యులు, కాంట్రాక్ట్ వర్కర్లకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ పీఓ ప్లహ్లాద్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీలు జీ.నర్సింహారావు, కిశోర్, ప్రసాద్, రామారావు, బలాజీ, నాగేశ్వరరావు, సందీప్, కావ్య, వైద్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేత


విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేస్తున్న దాతలు

ఎర్రుపాలెం, మార్చి 10: మండలంలోని రాజుపాలెం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం నారాయణపురం గ్రామానికి చెందిన సొసైటీ మాజీ చైర్మన్ కోగంటి సత్యనారాయణ వితరణతో ఆయన కుమార్తె రజిత క్రీడాదుస్తులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మర్రి యశోద, వ్యాయమ ఉపాధ్యాయుడు తల్లపురెడ్డి గోపిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేజీబీవీని సందర్శించిన ఏఎంవో


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎంవో

ఎర్రుపాలెం, మార్చి 10: స్థానిక కేజీబీవీ పాఠశాలను అకాడమిక్ మానిటరీ ఆఫీసర్ (ఏఎంవో) రవికుమార్ సోమవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. మరుగుదొడ్లు పరిశీలించి పెండింగ్ పనుల వివరాలు తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. విద్యార్థినులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సైన్స్‌డేలో ప్రతిభ చాటిన ప్రియదర్శిని విద్యార్థినులు


విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఖమ్మం రూరల్, మార్చి 10: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వరంగల్ నగరంలోని వాగ్దేవి కళాశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిట్‌లో ప్రియదర్శిని మహిళా కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం వరంగల్ నగరంలో జరిగిన పోటీల్లో మండలంలోని ప్రియదర్శిని కళాశాలకు చెందిన విద్యార్థినులు బీ.శ్రావణి, వీ.భాను, అక్షయ, కే.శ్రీలహరీలు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ డేటా సైన్స్ విభాగంలో చేసిన వినూత్న ఆలోచనకు ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థినులను కళాశాల చైర్మన్ కాటెపల్లి నవీన్‌బాబు, ప్రిన్సిపల్ బీ గోపాల్, డైరెక్టర్ ఏ వెంకటరమణ అభినందించారు.

## గురుదక్షిణ ఫౌండేషన్‌కు కుట్టుమిషన్లు వితరణ


కుట్టుమిషన్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వైరాటౌన్, మార్చి10: వైరా లయన్స్ క్లబ్, వైరా గ్రేట్ విజన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురుదక్షిణ ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన మహిళలకు క్లబ్‌లు ఆధ్వర్యంలో సోమవారం నాలుగు కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, జీఎస్టీ కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు, వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, వైరా గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్, మహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సత్తుపల్లిటౌన్, మార్చి10: మండలంలోని కిష్టారం గ్రామంలో రూ.70 లక్షలు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, ఎంపీడీవో, పీఆర్ డీఈ, ప్రభుత్వ అధికారులు, కిష్టారం గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రూరల్ వాసి మృతి


మనీష్ (ఫైల్)

ఖమ్మం రూరల్, మార్చి 10: ఏపీలోని ఆళ్లగడ్డ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం రూరల్ మండల వాసి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకున్నది. మండలంలోని బారుగూడెం పంచాయతీ శ్రీసిటీలో నివాసముంటున్న పిట్టల సుధాకర్, నిర్మల దంపతుల పెద్ద కుమారుడు మనీష్ (31) హైదరబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో తన స్నేహితుడి వివాహానికి మనీష్ శనివారం వెళ్లాడు. తిరిగి తన స్నేహితులతో కలిసి కారులో వస్తుండగా ఆళ్లగడ్డ వద్ద కారు ప్రమాదానికి గురై మనీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి సంవత్సరం క్రితమే వివాహం జరిగింది. మృతుడు తండి సుధాకర్ ఆర్టీసీలో ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ నాయకుడిగా ఉన్నారు. మృతదేహం మంగళవారం ఖమ్మం చేరుకోనుంది. మనీష్ మరణవార్త విని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శోక సముద్రంలో మునిగిపోయారు.


## వైరల్ ఫీవర్‌తో వ్యక్తి మృతి

పెనుబల్లి, మార్చి10: మండలంలోని యడ్లబంజర గ్రామానికి చెందిన బన్నే శ్రీనివాసరావు (35) వైరల్ ఫీవర్‌తో సోమవారం మృతిచెందారు. శ్రీనివాసరావు జ్వరంతో బాధపడుతూ ఆదివారం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆధారం లేకుండా పోయిందని కుటుంబసభ్యులు విలపిస్తున్నారు.

## ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు

సత్తుపల్లిటౌన్, మార్చి 10: సత్తుపల్లి శివారు తామర చెరువు వద్ద కూలీలతో వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తు సోమవారం పల్టీ కొట్టడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. కాకర్లపల్లి నుంచి 10మంది కూలీలతో ఆటోలో ఉపాధి పనికి వెళ్తుండగా తామరచెరువు వద్ద పల్టీ కొట్టడంతో ఐదుగురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 లో సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సావిత్రిబాయి పూలేకు నివాళి


సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న నాయకులు

ఖమ్మం, మార్చి 10: మన దేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాలు సోమవారం నగరంలో పలుచోట్ల జరిగాయి. మహాత్మా జ్యోతిరావు పూలే ఐడియాలజీ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పెళ్లూరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో వర్ధంతి జరిగింది. చిత్రపటాలకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కెవి.కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీలు/సంఘాల నాయకులు చెరుకుపల్లి నాగేశ్వరరావు, మిర్యాల నాగరాజు, బాసాటి హనుమంతరావు, గద్దె వెంకట్రామయ్య, జి.వెంకన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు

**ఖమ్మం అర్బన్‌లో..**

ఖమ్మం అర్బన్, మార్చి 10: నగరంలోని పెవిలియన్ గ్రౌండ్ సమీపంలోగల సావిత్రిబాయి పూలే విగ్రహానికి పీడీఎస్‌యూ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేష్, లక్ష్మణ్, పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామకృష్ణ పాల్గొన్నారు.